క్లుప్తంగా

నేడు చెక్కుల పంపిణీ

ఎల్కతుర్తి: మండలంలోని వివిధ గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద బుధవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ జగత్‌సింగ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. చెక్కులు వచ్చిన లబ్ధిదారులు ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల వద్దకు వెళ్లి తీసుకోవాలని సూచించారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌కు దరఖాస్తులు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి చెక్కులు మంజూరు అయినట్లు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన కోగిల ప్రమీల అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందగా మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ పరామర్శించారు. ఈ మేరకు రూ.2వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రేణికుంట్ల శశాంక్, మంద సాంబయ్య, గోవిందు, వెంకటేష్, పవన్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సత్కారం



నర్సంపేట: స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గుంటి రాంచందర్ మంగళవారం శాలువాతో సత్కరించారు. తొలుత మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బొనగాని రవీందర్, సాంబరాతి మల్లేషం, సంధాని పాల్గొన్నారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో..

తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని హనుమకొండలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. పేదరెడ్డి కులస్తుల హక్కుల సాధన కోసం సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటాన్ని ఎమ్మెల్యేకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో రెడ్డి కార్పొరేషన్ ప్రస్తావన ఉండడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జుల కిషన్‌రెడ్డి, నాయకులు రాధారపు సంజీవరెడ్డి, నల్ల రాజిరెడ్డి, చాడ జైహింద్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, గంగిడి ప్రభాకర్‌రెడ్డి, రావుల నర్సింహారెడ్డి, హరికృష్ణారెడ్డి, ఎం.పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ప్రభాకర్‌ను కలిసిన ఎర్రబెల్లి స్వర్ణ



వర్ధన్నపేట: హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న పొన్నం ప్రభాకర్‌ను ఆ నియోజకవర్గ కేంద్రంలో వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ వరద రాజేశ్వర్‌రావు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. మెరుగైన పాలన అందించాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్యే నాగరాజుకు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగ సంఘాల నేతలు

ఎంజీఎం : మేనిఫెస్టోలో ప్రవేశపెట్టిన ఉద్యోగుల సమస్యలను త్వరలోనే సీఎం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఉద్యోగ సంఘాల నేతలు ఎమ్మెల్యే నాగరాజు, దొంతి మాధవరెడ్డిలను కోరారు. ఎమ్మెల్యేలుగా వారిని జేఏసీ గౌరవ అధ్యక్షుడు సాంబశివరావు ఆధ్వర్యంలో పట్టణంలో పూలబొకేలు అందించి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు చెల్లించేలా చర్యలు తీ సుకోవాలని, పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు ప్రకటించాలన్నారు. ఈ కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులు క్లియర్ చేయించాలని మిగతా అన్ని సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలను కోరారు. కార్యక్రమంలో జీపీఏ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్‌గౌడ్, ప్రమోద్, బ్రహ్మయ్య, వివిధ ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన వర్షిత్

వేలేరు : రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు మల్లికుదుర్ల జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో చదువుకుంటున్న కీర్తి, శ్వేత, షాలిని, రిషి, రోహిత్, సాయికిరణ్ ఎంపికైనట్లు హెచ్ఎం జయసాగర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 4న మహబూబాబాద్‌లో జరిగిన అండర్ 14, 17 జిల్లాస్థాయి బాల, బాలికల విభాగంలో పాల్గొన్న క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను జెడ్పీటీసీ చాడ సరిత, సర్పంచ్ గొడెల రాజిరెడ్డి, ఉపసర్పంచ్ గొవింద సురేష్, పీఈటీ సుమలత, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ధర్మసాగర్‌లో..

ధర్మసాగర్: మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి బచ్చలకూరి వర్షిత్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం బత్తిని రాజేందర్ మంగళవారం తెలిపారు. ఈ నెల 11న శంభునిపేట హైస్కూల్ గ్రౌండ్‌లో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న వర్షిత్.. ఈనెల 13 నుంచి 15 వరకు నారాయణపేట జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన వర్షిత్‌ను, పాఠశాల పీఈటీ సుధాకర్‌ను స్థానిక సర్పంచ్ ఆకారపు అన్నమ్మ, మాజీ సర్పంచ్ తోట స్రవంతినాగరాజు, ఉపసర్పంచ్ శివాకర్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ మామిడాల కిషోర్, బత్తిని రాజ్‌కుమార్, సోమ అమర్నాథ్, పీఎస్ హెచ్ఎం చాడ మల్లారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మోకాళ్లపై తిరుపతి మెట్లెక్కిన నాయకులు



మోకాళ్లపై తిరుమల మెట్లు ఎక్కుతున్న నాయకులు

కమలాపూర్: ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలిస్తే తిరుపతి దేవస్థానికి వచ్చి మోకాళ్లపై మెట్లు ఎక్కుతామని మండలంలోని మర్రిపల్లిగూడెంకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు మొక్కుకున్నారు. ఈ మేరకు కౌశిక్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో వారంతా తిరుమల తిరుపతికి వెళ్లి మోకాళ్లపై మెట్లెక్కి వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కౌశిక్‌రెడ్డి గెలుపొందడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇనుగాల విజయ్‌కుమార్, కదురు తిరుపతి, స్వామి, రాజేందర్, శ్రీకాంత్, మల్లికార్జున్, కృష్ణ, మహేందర్, రవి, రాజు, అంజి, రాజేష్, శేషు, సుమంత్, ప్రశాంత్, అరవింద్, పవన్, నరేష్, రాకేష్, దిలీప్, భాషా, నోహర్, ఉదయ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

17న ఆర్‌పీఐ సమావేశం

నర్సంపేట: హైదరాబాద్‌లోని ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ కాంప్లెక్స్‌లో ఈనెల17న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ (ఆర్‌పీఐ) సమావేశం నిర్వహిస్తామని సమన్వయకర్త, సీనియర్ నాయకుడు జన్ను సాంబయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆర్‌పీఐ, షెడ్యూల్డ్ క్యాస్ట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సీనియర్, బహుజన ఉద్యమ నాయకులు, మేధావులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

గ్రామాల్లో ఆర్ఎంపీల సేవలు కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పృథ్వీరాజ్

శాయంపేట : గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు అందిస్తున్న వైద్య సేవలు కీలకమని డాక్టర్ పృథ్వీరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామీణ వైద్యులకు మంగళవారం పట్టణంలోని ఉమాదేవి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. శీతాకాలంలో వచ్చే జలుబు, దగ్గు, జ్వరంతో పాటు దోమల వలన వ్యాప్తి చెందే టైఫాయిడ్, మలేరియా వ్యాధుల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామీణ వైద్యులు మోతాదుకు మించి ఆంటీబయాటిక్‌లు ఉపయోగించవద్దని సూచించారు. డాక్టర్ రాహుల్యారెడ్డి, ఆర్ఎంపీ సంఘం జిల్లా కోశాధికారి కర్రు సంపత్, మండల అధ్యక్షులు కానుగుల నాగరాజు, ఉపాధ్యక్షులు అనిల్, కార్యదర్శి భిక్షపతి, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు హింగే భాస్కర్, మాజీ కోశాధికారి రంగు శ్రీధర్, ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఉద్యోగి

వర్ధన్నపేట: ఓ ప్రభుత్వ ఉద్యోగి అనారోగ్యంతో సొమ్మసిల్లి పడిపోయిన ఓ వ్యక్తిని చేరదీసి ఆహారం అందించి, కొత్త దుస్తులు ధరింప చేసి మానవత్వం చాటుకున్నాడు. వివరాలిలా.. పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్న ఉద్యోగి సుదర్శన్ ఆస్పత్రి వద్దకు వచ్చి ఓ వ్యక్తి సొమ్మసిల్లి పడిపోవడాన్ని గమనించి సపర్యలు అందించాడు. నీరసం వల్ల సొమ్మసిల్లినట్టు గుర్తించి వెంటనే ఆహారం తెచ్చి తినిపించాడు. తదనంతరం చిరిగిన బట్టలను చూసి కొత్త దుస్తులు తీసుకొచ్చి అందించి ఔదార్యం ప్రదర్శించాడు. సుదర్శన్‌ను ఆస్పత్రికి వచ్చిన రోగులు, స్థానికులు అభినందించారు.

ఆర్ఎంపీకి దేహశుద్ధి

ఖానాపురం: మహిళకు అసభ్యకరమైన మెసేజ్‌లు పంపిన ఓ ఆర్ఎంపీకి దేహశుద్ధి చేసిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలానికి చెందిన ఓ ఆర్ఎంపీ ఒక మహిళకు వాట్సప్ ద్వారా అసభ్యకరమైన మెసేజ్‌లు పంపించాడు. ఈ విషయం తెలుసుకున్న మహిళ భర్తతోపాటు కుటుంబ సభ్యులు సదరు ఆర్ఎంపీని చితకబాదారు. ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. ఎస్సై మాధవ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఆలయ గర్భగుడిలో పాము పిల్ల ప్రత్యక్షం

గీసుకొండ: మండలంలోని ఊకల్ నాగేంద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామి వారికి పూజలు నిర్వహిస్తుండగా పాము పిల్ల ప్రత్యక్షమైందని ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా అభిషేకం, అలంకరణ అనంతరం గర్భగుడిలోని పుట్టలోంచి పాము పిల్ల బయటకు వచ్చి కొంత సమయం కలియ తిరిగిందని ఆయన చెప్పారు. పాము పిల్ల ప్రత్యక్షం కావడం శుభసూచకమని ఈ సందర్భంగా వివరించారు.

ప్లాట్ల కేటాయింపుల్లో అన్యాయం

- అర్హులను గుర్తించాలని డీడీఎంకు వినతి



డీడీఎంకు వినతిపత్రం ఇస్తున్న చిరువ్యాపారులు

వరంగల్ : వరంగల్ లక్ష్మీపురంలో మోడల్ మార్కెట్‌లో జరిగిన ప్లాట్ల కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని మార్కెట్‌లోని చిరువ్యాపారులు మార్కెటింగ్ శాఖ డీడీఎం రాజునాయక్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిరువ్యాపారులు మాట్లాడుతూ.. లక్ష్మీపురం పాత మార్కెట్ మోడల్ కూరగాయల మార్కెట్‌లోకి షిఫ్టింగ్ సమయంలో అర్హులమైన తమకు ప్లాట్లు కేటాయించలేదన్నారు. కొంతమంది కమీషన్ దుకాణదారులకు అదనంగా కుటుంబ సభ్యుల పేర్లతో ఓపెన్ ప్లాట్లు కేటాయించారని ఫిర్యాదు చేశారు. అర్హులుకానివారి వివరాలు గతంలో మార్కెట్ కార్యదర్శి బీవీ.రాహుల్‌కు అందజేశామన్నారు. అర్హులకు ప్లాట్లు ఇవ్వడం లేదని, అధనంగా ప్లాట్లు పొందారంటూ పలు దినపత్రికల్లో కథనాలు వచ్చినా పట్టించుకోలేదన్నారు. ఆరు నెలల నుంచి మార్కెట్ కార్యదర్శి చుట్టూ మాకు న్యాయం చేయాలని ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోలేదన్నారు. అర్హులకు ఓపెన్ ప్లాట్లు కేటాయించాలంటూ బుధవారం కూరగాయల మార్కెట్ ఎదుట చిరువ్యాపారులందరం కలిసి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. డీడీఎంకు వినతి ప్రతం సమర్పించిన వారిలో బూర ప్రకాష్, ప్రసాద్, కంచి రాజ్‌కుమార్, నాగరాజు, గోపాల్, సురేష్, రహీం, శ్యాంలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి

గీసుకొండ: నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) స్కీంలో అనేక ఏళ్లుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న వారిని పర్మనెంట్ చేయాలని ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్‌ఖన్నా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలు, బ్లడ్‌బ్యాంకులు, పీహెచ్‌సీలు, ఆయుష్‌తోపాటు ఇతర వైద్య విభాగాల్లో పని చేస్తున్న ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాల్సిన బాధ్యత నూతన ప్రభుత్వం మీదే ఉందన్నారు.

పరామర్శ

రాయపర్తి: మండలంలోని చక్రుతండాకు చెందిన గుగులోతు యాకన్న ఇటీవల కాలు విరిగి గాయపడగా ఆయన్ను కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. వైద్య ఖర్చుల కోసం రూ.10 వేల నగదు అందించారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ ఉన్నారు.

16న గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం



సమావేశంలో మాట్లాడుతున్న వీరన్ననాయక్

కేయూ క్యాంపస్ : గిరిజన ఉద్యోగుల, ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం నిర్వహించనున్నట్లు కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం రిటైర్డ్ ఆచార్యులు గుగులోతు వీరన్ననాయక్ తెలిపారు. మంగళవారం కాకతీయ యూనివర్సిటీలో గిరిజన ఉద్యోగుల, అధ్యాపకుల, విద్యార్థి సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రిగా ధనసరి సీతక్కకు అవకాశం కల్పించటం అభినందనీయమన్నారు. సీతక్కతో సహా మిగితా గిరిజన ఎమ్మెల్యేలకు ఆత్మీయ సత్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. సమావేశంలో యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య బి.సురేష్‌లాల్, డాక్టర్ రమేష్, దేవేందర్‌జాదవ్, మహేష్, నెహ్రూచంద్,హనుమంతు, యాదగిరి, రమేష్, దేవేందర్, విష్ణు, శారద, వనిత, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

17నుంచి శివానందమూర్తి జన్మదిన వేడుకలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్తగురుధామంలో పూజ్య సద్గురు శ్రీశ్రీశ్రీ కందుకూరి శివానందమూర్తి 95వ జన్మదినోత్సవ వేడుకలు డిసెంబర్ 17 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. మంగళవారం గురుధామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా రాష్ట్రస్థాయి సంగీత, నృత్య, పేరణీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే ఆసక్తిగల వారు బండారు సాయినారాయణ సెల్ నంబర్ 98484 23133ను సంప్రదించాలని సూచించారు. ట్రస్ట్ బండారు సాయినారాయణ మాట్లాడుతూ ఈ వేడుకలకు దేశ విదేశాల నుంచి భక్తులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు హాజరుకానున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ట్రస్టీలు సోమరామయ్య, మాదారపు సదాశివుడు, గందే ఉమాశంకర్, రేపాల రామచందర్, ఎండీ.లాయక్ అహ్మద్ పాల్గొన్నారు.

కమలేష్ కమిటీ సిఫారసు అమలు చేయాలి



వరంగల్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఖిలా వరంగల్: తపాలాశాఖ జీడీఎస్ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను తక్షణమే అమలు చేయాలని ఆశాఖ జీడీఎస్, ఏఐజీడీఎస్‌యూ, ఎన్‌యూజీడీఎస్ డివిజన్ ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు అప్పని రవీందర్, డి.ఉమేష్ డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీల పిలుపు మేరకు మంగళవారం వరంగల్ స్టేషన్‌రోడ్డులోని తపాలాశాఖ డివిజన్ కార్యాలయం ఎదుట ఆల్‌ఇండియా గ్రామీణ డక్ సేవక్స్ యూనియన్, నేషనల్ యూనియన్ ఆఫ్ గ్రామీణ డక్ సేవక్స్ సంఘాల వరంగల్ డివిజన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరవధిక సమ్మెను చేపట్టారు.

అక్రమార్కులపై చర్య తీసుకోవాలి



మాట్లాడుతున్న బట్టు స్వామి

వేలేరు : మండలంలోని మల్లికుదుర్లలో గల ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన బట్టు స్వామి కోరారు. మంగళవారం మల్లికుదుర్ల గ్రామంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గ్రామంలోని ప్రభుత్వ భూములను కొంత మంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు స్థానికులతో కలిసి కబ్జాచేసి సాగుచేసుకుంటున్నారని ఆరోపించారు. ప్రభుత్వ భూమిలోఉన్న చెట్లను సైతం అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ భూములను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజిరెడ్డి వివరణ కోరగా కొంతమంది రియల్‌ఎస్టేట్ వ్యాపారులు చెట్లు నరికి అమ్ముకున్నది వాస్తమేనని, వారిపై కఠిన తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా స్వరాజ్య స్థాపన వార్షికోత్సవం



శిలాఫలకానికి పూలు చల్లుతున్న నాయకులు

శాయంపేట : ధర్మసమాజ్ పార్టీ చీఫ్ డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టిన స్వరాజ్య స్థాపన పాదయాత్ర వార్షికోత్సవాన్ని మండల కేంద్రంలో ఆపార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. శిలాఫలకానికి పూలు చల్లుతూ నినాదాలు చేశారు. గతేడాది డిసెంబర్ 12న చేపట్టిన యాత్ర మంగళవారంతో సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా సంబరాలు చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాల్యాల అమరేందర్, నాయకులు మధు, దేవేందర్, పవన్, ప్రశాంత్, సతీష్ మాట్లాడారు. కల్వకుర్తి పట్టణ కేంద్రంలో డాక్టర్ విశారధన్ మహారాజ్ చేపట్టిన పదివేల కిలోమీటర్ల స్వరాజ్య పాదయాత్ర తెలంగాణలో 93శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని కలిగిస్తూ 33 జిల్లాలు, 300 మండలాలు, 3000 గ్రామాల మీదుగా కొనసాగిందని గుర్తు చేశారు. గత ఏడాది ఇదే పాదయాత్ర మండల కేంద్రంలో కొనసాగిందని, ఈ సందర్భంగా సంబురాలు చేసుకున్నట్లు పేర్కొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేతలు మౌనం వీడాలి



పరకాల : ధర్నా చేపట్టిన నాయకులు



ఆత్మకూరు : రాస్తారోకో చేస్తున్న నాయకులు

పరకాల: కాంగ్రెస్ పార్టీ ఎంపీ ధీరజ్‌సాహు అక్రమాస్తులపై కాంగ్రెస్ అధినేతలు మౌనం పాటించడం విడ్డూరంగా ఉందని బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ కాళీప్రసాద్‌రావు అన్నారు. కాంగ్రెస్ ఎంపీ అక్రమ ఆస్తులను కూడబెట్టుకోవడాన్ని నిరసిస్తూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని బస్టాండ్ కూడలిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళీప్రసాద్‌రావు మాట్లాడుతూ.. దేశ చరిత్రలో ఏనాడు పట్టుబడని నగదు నిల్వలు కాంగ్రెస్ ఎంపీ ఇంట్లో లభ్యం కావడం ఆశ్చర్యమేస్తోందన్నారు. ఐటీ శాఖకు పట్టుబడిన రూ.350 కోట్ల రుపాయాల నగదు నిల్వలపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఇలాంటి అక్రమ ఆస్తులను కూడగట్టి దేశాన్ని కొల్లగొడుతున్న నాయకులపై చర్య తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు గాజుల నిరంజన్, కుక్కల విజయ్, కౌన్సిలర్ కొలనుపాక భద్రయ్య, ఉపాధ్యక్షుడు సంఘ పురుషోత్తం, నాగెల్లి రంజిత్‌కుమార్, పాలకుర్తి తిరుపతి, నాయకులు సోమరాజ్, దంచనాల సత్యనారాయణ, కానుగుల గోపినాథ్ పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్‌గా కాంగ్రెస్

ఆత్మకూరు: అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి విమర్శించారు. కాంగ్రెస్ ఎంపీ ధీరజ్‌సాహో ఇంట్లో రూ.350కోట్లు బయటపడడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలుపుతూ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా విజయ్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో నీతినిజాయితీ గల పార్టీ బీజేపీ అన్నారు. అక్రమ సంపాదన కూడబెట్టుకున్న ఎంపీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, మండల ప్రధానకార్యదర్శి ఉప్పుగల్ల శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి బయ్య పైడి, బీజేవైఎం మండల అధ్యక్షుడు పోరెడ్డి ప్రదీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం



దామెర : పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శులు



ఆత్మకూరు : ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర: గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలో విధులు నిర్వర్తిస్తున్న పంచాయతీ కార్యదర్శులు మంగళవారం ఎమ్మెల్యేను మార్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విధుల్లో పోటీతత్వంతో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శుల ఫోరం ప్రధాన కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్, డివిజన్ అధ్యక్షుడు మనోహర్, జిల్లా ప్రచార కార్యదర్శి యాదగిరి, సునీల్, వేణుగోపాల్‌రెడ్డి, అన్నపూర్ణ, పద్మ, అమిత, సరళ, అనూష ఉన్నారు.

ఎమ్మెల్యేకు అభినందన

ఆత్మకూరు: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు.

అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

దామెర: అర్హులైన యువతి, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి మంగళవారం ప్రకటనలో కోరారు. 2024 జనవరి1 వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అంతే కాకుండా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, చేసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లేదా బీఎల్ఓలను సంప్రదించాలని పేర్కొన్నారు. మండలంలోని అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.